# మూగ వీణా !

బహుశా రాత్రి పది దాటుంటుంది!

ఆకాశాన్ని కారుమేఘాలు కమ్ముకుని, ఇంద్రుని వజ్రాయుధపు ఝులుపింపుల్లా మెరుపుతీగెల్ని ప్రసరిస్తూ, ఉరుముల గర్జనల్ని వినిపింపజేస్తున్నాయి. వెంటనే, ఇళ్ళ కప్పుల్ని ఎగరేసుకుపోయేలా గాలి వీవసాగింది. చిన్నతనంలో పంతులువద్ద తిన్న మొట్టికాయల్ని గుర్తుచేసేంత పెద్ద వర్షపు బిందువులు పడసాగాయి. త్వరలోనే అది పెనుతుఫానైంది.

సరిగ్గా అదే సమయంలో ఒక పడుచుకన్య- ఒక గొప్ప భవనపు ప్రాకారం ప్రక్కగా పోతోంది. తుఫాను తీవ్రతకు ఆగలేకగావును. ఆమె ఆ భవనపు చిన్న గేటులోంచి ఆ ఆవరణలోకి ప్రవేశించి, పోర్టికోలో నిలబడింది. గేటువద్ద గల పాలరాళ్ళ చెక్కడాలు 'ధర్మారావు' 'ధర్మ నిలయం' అనే పేర్లను మెరుపుల్లో ఎరుకపరుస్తున్నాయి.

ఆ యువతిరాకను పసికట్టిన ఆ ఇంటి పెంపుడు కుక్క 'భౌంయ్' మని లోపల్నించి మొరుగుతూ తన విధ్యుక్త ధర్మాన్ని పాటిస్తోంది. అది కట్టివేయబడి ఉండడంవల్ల కిటికీఊచల వెనకనుండే గోల చేస్తోంది- మాటలు నేర్చిన మానవులకన్న మిన్న అన్నట్టు కోపంతో నురుగులు గ్రక్కుతూ తన విశ్వాసలక్షణాన్ని చాటుతోంది. అది మధ్యవాటా వాళ్ళకి చెందిన కుక్క.

ఆ వాటాలోని ఇద్దరు పిల్లలూ, దాని అరుపులు విని, కిటికీ వద్దకు వచ్చి, ఆ స్త్రీని చూశారు.

"అదుగోర్‌య్! బూచీ! నిన్ను ఎత్తుకుపోతుంది" అంది అక్క.

"నన్ను ఎత్తుకెళ్లకు. అక్కనెత్తుక్పో" అన్నాడు చిట్టితమ్ముడు.

అంతోకి గృహలక్ష్మి తలుపు తెరుచుకొచ్చి, బయటి లైటేసింది. ఆమెని ఆనుమానాస్పదంగా చూడసాగింది.

ఆ స్త్రీ తడిపి ముద్దయి వణుకుతూనే నుంచునుంది.

"ఎవరే నువ్వా?" అని గదమాయించింది.

ఆ స్త్రీ మౌనంగా వానవైపు వేలు చూపింది.

"వర్షం వొస్తే, మా ఇల్లే దొరికిందా? ధర్మసత్రాలు లేవూ?" అందా ఇల్లాలు ఆవేశంతో.

ఆ కుక్క గృహిణి ఆసరా చూసుకుని మరింత పెనుగులాడసాగింది. గొలుసు తెంచుకుని ఆమెమీద పడాలని.

అప్పుడు ధర్మారావుగారు బయటికొచ్చేరు. ఆ పడతి తడిసి ఉండడం, బయట ముంచుకొస్తున్న తుఫాను– అన్నీ చూసి చాలా జాలిపడ్డారు.

"పోనీలే, కూచోనీవే. ఇంతలోకి మన సొమ్మేంపోయింది. వర్షం తగ్గితే అదే పోతుంది– వర్షంలో తడిసినట్టుంది; చలేస్తోందేమో?" అన్నారాయన.

చిన్నపిల్లాడు ఓ రగ్గు లాక్కొస్తూ, "బూచీ చలేత్తోందా ? ఈ లగ్గు తప్పుకో" అనసాగేడు.

తల్లి చటుక్కున వాణ్ణి ఎత్తుకుని, రగ్గు లాగి ఇంటిలోకి విసిరేసి, "ధర్మనిలయంలో అందరూ ధర్మాత్ములే! ధర్మసత్రం అనండి ఇంకా బాగుంటుంది. మహా". అంటూ విసురుగా లోపలికి నిష్క్రమించింది.

ఆయన లోపలికి వెళ్ళేముందు, "అట్లా కూచో! ఎంత సేపు నిలబడతావు" అని, తలుపు వేసుకుని, కుక్కని నిమిరి, సముదాయించి, తమ పనిలోకి వెళ్ళిపోయేరు.

కిటికీలగుండా వెలుతురు కొంచెంగా బయటపడుతోంది. రోడ్డుమీది దీపాల కాంతి చెట్ల ఆకులమీద పడి, వర్షపు బిందువుల్లో వివిధరంగులుగా విరజిమ్మబడుతోంది. విశ్లేషించబడి.

ఆ స్త్రీ ప్రక్కవాటా తలుపుని ఆనుకుని, గుమ్మంవద్ద కూచుని చలికి కొద్దిగా వణుకుతూంది.

ఇంతలో – పై సంభాషణలు విన్నారో ఏమో తెలీదుగాని– ప్రక్కవాటాలో ఉన్న విద్యార్థులు నలుగురు బయటికి వొచ్చేరు.

వాళ్ళలో ఒకడి చేతిలో టార్చిలైట్ ఉంది. అతడు ఏమీ ఎరగనట్టు, ఆ స్త్రీమీదికి లైట్ వేశాడు.

ఆ స్త్రీ బిత్తరబోయి చూడసాగింది. కోపంతో మొహం చిట్లించుకుంది. వక్షాన్ని రెండుచేతుల్తో కప్పుకున్నది. జాకెట్టూ, చీరా చినిగినచోట్ల, అక్కడక్కడ ఆమె యవ్వనపు పటిమను బహిర్గతం చేస్తున్నాయి. నల్లని భారమైన కుంతలాలు మొహంమీద పడి నీటి బిందువుల్ని ఓడుస్తున్నాయి. పెదిమలు ఉద్రేకంతో, ఏదో అనబోతున్నట్టు కదలసాగేయి.

"ఎవరూ?" అన్నాడతడు మరీ దగ్గరగా వెళ్ళి.

గాలివానవైపు చూపించింది కళ్ళతో.

"ఎవరో – రకంరా!" అన్నాడు వేరొకడు.

"కాకపోతే ఈ వేళకానివేళలో ఇలా వీధి నెందుకు పడుతుంది?" అన్నాడు మరొకడు.

"మనిషి బాగానే వుందిరా!"

"పోరా! నీవన్నీ పాడుబుద్ధులే! ఆడది కనపడితేచాలు- వె[రెత్తిపోతావు"

"నువ్వు మహా ఏకపత్నీవ్రతుడవైనట్టు మాట్లాడుతున్నావే!"

"అసలు నాకు పెళ్ళేకాందీ!"

"అవకపోతే అపర ప్రహ్లాదుడవు - కనపడిన ప్రతి స్త్రీనీ, తల్లిగానో, చెల్లెలిగానో భావించుకోందే బతకజాలని దుర్బలుడవు!"

"మీరేమని ఉడికించినా ఫరవాలేదు. నేను మీలా అచ్చోసిన ఆంబోతునీ కాను! మదపిచ్చ పట్టిన మదపు టేనుగునూ కాలేను."

"అట్లా చూడవోయ్, నిజంగా - బెగ్గర్ మెయిడ్!"

"అవును నిజమే! టెనిసన్ వర్ణన సమంగా సరిపోతుంది - షి లెయిడ్ హర్ ఆరమ్స్ ఎక్రాస్ హర్ బ్రెస్ట్."

"కొంపతీసి నువ్వు రాజు 'కొఫెట్యూవా'లా 'పాణి బట్టుకు రాణి చేసెద' అనవు కదా!"

"మీ రందరూ నా కోర్టియర్సు - పొగడండిలా! 'చందమామకు చందమైనా అందమైనా సుందరాంగిది' అంటూ."

ముగ్గురూ విరగబడి నవ్వేరు! నాల్గోవాడు బాధతో మౌనం వహించాడు.

"ఎదుట ఉన్నది ఒక స్త్రీ. ఆమెకి ఇంగితజ్ఞానం ఉందనీ, ఆమె బాధపడుతుందనీ తెలీదూ?" అందామని పెదిమలు కదపబోయింది. కాని ఉద్రేకంలో అవి పెగల్లేనట్టయింది. ఆ వాగుడుకు చిన్నబుచ్చుకున్నట్టు తల వొంచుకుంది.

తుఫాను తీవ్రత అధిక మవసాగింది.

తమ మాటలు ఎవరికీ వినపడవు! తమను చూసేవారెవ్వరూ లేరు. ఎవళ్లకి గాని క్రొత్త ప్రదేశంలో, తమ చర్యల్ని గమనించేవారెవరూ - అందులోనూ పరిచయస్థు లెవరూ - లేరని తెల్సినప్పుడు, వారిలో చెలరేగే అణగార్చబడిన దుష్ట ఆలోచనలకూ, చెయ్యబోయే చెడు కార్యాలకూ పరిమితి ఉండదు.

ఆ వర్షపు హోరులలో తమ మాటలు ఎవరికీ వినపడవనే ధైర్యమొకటీ, వంటరిగా-ఎవతైతేనేం- ఒక స్త్రీ కనపడడం, వర్షపు వాతావరణం అంతర్గతంగా కన్పిస్తున్న భావోద్రేకాల విజృంభణం. అన్నీ వాళ్ళని వివశుల్ని చేస్తున్నాయి. అన్నిటినీ మించి-బాధ్యతారహిత మైన విద్యార్థిదశలో వుండడం, తేలిక జీవనానికి అలవడి ఉండడం మరొకటి!

"ఈ విశాల భారత దేశంలో ఒక బీదస్త్రీకి. వర్షంనుండి సంరక్షించుకోడానికి గాను, కాసేపు ఒక ఇంటిముందు నిలబడే హక్కు లేదా? అప్పుడే-పెడర్థాలు తీస్తారు-నోటికివచ్చినట్టు దారుణాతి దారుణంగా?"

చూపుల ప్రశ్నావళి తూపులు!

"పోదా"మనుకుని లేచి, కొంచెం కదిలింది. కాని ఉరుములూ, మెరుపులూ, హోరునగాలీ, భోరున వర్షమూ భయపెట్టసాగేయి. తిరిగి తనచోటులోకే వొచ్చి, కూచుంది.

తక్కినవాళ్లంతా ఎవరి పనుల్లోవారు మునిగి వున్నారో, నిద్రపోతున్నారో - బయటికే రావడంలేదు. కొన్ని ఇళ్ళల్లో దీపాలు కానరావడంలేదు.

ఒకడు మరీ దగ్గరకు వెళ్ళి, మొహంమీద టార్చీవేసి, "అపర అప్సరసోయ్!" అని నవ్వేడు.

మిగతా ఇద్దరుకూడా పళ్లు ఇకిలించేరు.

"ఐతే ఇకనేం?" అన్నాడు మరొకడు.

"రే టెంతో?" అని గొణిగేడు వేరేవాడు.

ఆమె మొహం క్రోధంతో నిప్పులు చెరుగుతోంది. అసహ్యమేస్తున్నట్టు ఛీత్కారించుకుంది.

"మీరు మనుష్యులు కారు? ఏమిటా మాటలు!! మీకు అక్కలూ, చెల్లెళ్ళూ లేరూ?" అడగబోయింది. అంతలోకి నాలుగోవాడు ఆవే మాటల్తో వాళ్ళని కడిగిపారేశాడు.

"మహా నీతిమంతుడు పుట్టాడోయ్!" అని నవ్వేశారు మిగతా ముగ్గురూను.

వాళ్ళు మరీ మీది కొస్తుంటే, "నీవే శరణ్య" మని అతని వైపు దీనంగా చూడసాగిందామె.

అప్పుడు ధర్మారావుగారి గుమ్మంవద్ద చప్పుడైంది. అది పసిగట్టినవీళ్ళు, చల్లగా లోపలికి జేరేరు-ఏమీ ఎరగనట్టు. ఆయన బయట లైటేసి, వాతావరణ తీవ్రతని ఓసారి పరికించి, ఆ స్త్రీ అక్కడే ఉండడం పరిశీలించి, ఆత్మ సంతృప్తి చెందినట్టు చూస్తూ, లోపలికి వెళ్ళి తలుపులు వేసుకున్నారు.

ఎంతసేపైనా గాలివాన తగ్గలేదు. ఆ స్త్రీ తడిబట్టల మూటలా, అట్లాగే గుమ్మాని కంటిపెట్టుకుని కూచుంది.

ఆమె కూర్చున్న వాటావాళ్ళు కూడా లైట్లార్పేసి, పడుకుంటున్న అలికిడి వినపడింది.

మరోగంట గడిచింది.

విద్యార్థుల గదిలో దీపం ఆరింది - వాళ్ళు మాటుమడిగిన సూచనగా.

"ఇంకేం భయంలేదు, బాబూ" అనుకుంటూ ఆమె మనస్సులోనే ధైర్యం పొందింది.

అట్లాగే శూన్యంలోకి చూస్తూ, ప్రకృతి ప్రళయకాల విలయతాండవం తిలకిస్తూ కూర్చుంది-దేవుణ్ణి ప్రార్థించుకుందేమో కూడా!

అలిసి సొలసిన మూలానో, తడిసి ముద్దయిన మూలానో కునికి తృళ్లింది. అప్పుడు ఆమె తల తలుపుకు తగిలి కొంచెం చప్పుడైంది. ఆ చప్పుడుకు, కుక్క మూతి కిటికీ ఊచల్లోంచి బయటికి పెట్టి, గుర్రుమన్నది.

"ఎవరదీ?" ఆ వాటాలోని స్త్రీ కంఠం ప్రశ్నించింది.

"ఎలకేమోనే!" అని మగ గొంతు సర్దిబుచ్చింది.

"బాబోయ్! కొంపతీసి వీళ్ళూ బయటికి రారు కద!" అనుకుంటూ ఆ స్త్రీ, ఆ మాటలకి ఉలిక్కిపడి, కొంచెం ప్రక్కకి జరిగి సర్దుకు కూచుంది.

మళ్లీ కొన్ని నిమిషాలు నిష్క్రమించేయి. కాలసాగరగర్భంలోకి.

విద్యార్థుల గదిలోంచి ఒకడు బయటికి వొచ్చాడు. కాండ్రించి ఉమ్మేశాడు. ఆ స్త్రీ అక్కడే ఉండడం గమనించేడు. తలుపులు ఓరగిలా వేసి ఆమెవైపు పిల్లిలా నడిచేడు.

మళ్ళా అదోలా సకిలించేడు.

"ఇంకా వెళ్ళలేదూ?"

"... ... ... ..."

"ఎవరు నువ్వు?"

"... ... ... ..."

"ఏం కావాలి నీకు?"

"... ... ... ..."

"ఇక్కడ చలిగా లేదూ? లోపలికి వొస్తావా, పోనీ?"

"... ... ... ..."

"పొడిబట్టలిమ్మంటావా?"

"... ... ... ..."

"ఇందాకటి మా ప్రవర్తనకి కోపం వచ్చిందా, పలకడంలేదు?"

"... ... ... ..."

"నాతో మాట్లాడదలుచుకోలేదా? ఊరికే వేళాకోళానికి అన్న మాటలకు ఎవరన్నా కోపగిస్తారా ఎక్కడైనాను?"

"... ... ... ..."

"నాకు నిజంగా పేదవాళ్ళంటే ఎంత ప్రేమా, అభిమానమూ అనుకున్నావ్!"

"... ... ... ..."

"ముందుముందు నీకే తెలుస్తుందిలే!"

"... ... ... ..."

ఇంకొంచెం దగ్గరికి వెళ్ళేడు. కూచున్నాడు. మోకాళ్ళపై.

"నే నేం కొరుక్కు తిననులే!" అంటూ భుజంపై చెయ్యి వేశాడు.

చీకట్లో ఆ పడతి భావాలు తెలీడంలేదు. ఆయాసంతో వొగరుస్తోంది. తనను తానే సంబాళించుకోలేకపోతోంది. మౌనంగానే లేచి నించుంది. అతనూ నిలబడ్డాడు.

మౌనం అర్థాంగీకార మనుకుంటూ, రెండు భుజాలపైనా చేతులు వేశాడు.

"నా రాణివికదూ... నీ మౌనభాషలు నాకు అవగతమే!" అంటూ బాహుపంజరంలో బంధించబోయేడు. ఆమె ఆవేశం పట్ట శక్యంకాలేదు.

చెంప ఛెళ్ళు మనిపించింది.

"దొంగముండా!" అంటూ, ఆమెని దూరంగా నెట్టుతూ, తూలుతూ తమ గదిగుమ్మం దగ్గరికి వెళ్ళేడు.

ఆమె ఆ తోపుకు ప్రక్కనున్న గుమ్మంపై పడింది. పెద్ద చప్పుడైంది.

ఆ ప్రక్కవాటాలోని భార్యాభర్తలు తలుపు తెరుచుకుని వొచ్చి, బయట లైట్ వేశారు.

"ఏమిటా చప్పుడు?"

'ఎవరీ అమ్మీ?"

విద్యార్థి నడిగేరు.

"ఎవత్తో దొంగముండ !" అన్నాడు దొంగలా చూస్తూ. ఒక చేత్తో చెంప నిమురుకోబోతూ.

"కాదు బాబోయ్!" అందామని పెదిమలు కదిపింది. కాని శబ్దం వెలువడలేదు. జాలిగా చూసింది.

"ఐతే ఇందాకట్నించీ ఊరుకున్నావేం, అరవక? చప్పుడైతే ఏదో ఎలక అనుకున్నాను మొదట!" అన్నాడు భర్త.

"ఈ రోజుల్లో ఆడాళ్ళు దొంగలూ, గూండాలూ, హంతకులూ అవుతున్నారుటండీ" అంది భార్య.

"అదీగాక – మగాళ్ళే ఆడవేషాలతో దొంగతనాలు చేస్తున్నారుట" అని కృతికలిపేడా విద్యార్థి.

"అవును–నిజమే" అంది ఆ ఇల్లాలు.

"ఏమే, ఎవరవే?"

"ఏం దోచుకుందామని వొచ్చావే?"

"కాళ్లు విరగ్గొడతాం జాగర్త."

"కట్టిపడేస్తాం!"

భార్యాభర్తలు నిలదీయసాగేరు. ఆ స్త్రీ నిస్సహాయంగా, నీరై జాలిగా చూడ్డం తప్ప, మారు పలకలేకనేపోయింది.

"అట్లా పలుకుతుందాండి – పోలీసులకి ఫోను చెయ్యండి" అంది భార్య.

"మంచి సూచనే!" అన్నాడు విద్యార్థి బలపరుస్తో.

"వద్దు బాబూ! నే నేమీ ఎరగను– క్షమించండి" చూపుల్తోనే అంది. భర్త గమనించకుండా లోపలికి వెళ్ళి ఫోను చేశాడు– కళ్ళ భాష లెరుగడు గావును.

అప్పటికి తుఫాను తీవ్రత తగ్గుముఖం పట్టింది. వెళ్ళిపోడానికి లేచింది- వాతావరణాన్నోసారి పరికించి.

"పారిపోదాం అనుకుంటోంది. పోనీకండి" అన్నాడు విద్యార్థి.

"ఎక్కడికి పోతావే!" అంటూ అడ్డు నిలిచిందా మహాఇల్లాలు.

ఆ స్త్రీ భయంతో వొణుకుతూ, అచేతనురాలై అట్లాగే నిలబడిపోయింది.

'తగిన శాస్తి కావాలి!' అని సంతోషిస్తున్నాడా విద్యార్థి లోలోపలే.

పోలీసులకు ఫోను చేసిన భర్త విజయగర్వంతో బయటి కొచ్చేడు.

మరికొన్ని నిమిషాల్లో పోలీసు వాన్ ఇంటిముందు ఆగింది. ఒక సార్జెంటూ, నలుగురు కాన్‌స్టేబుల్సూ దిగి, మార్చ్ చేసుకుంటూ వొచ్చేరు.

ఆ వాన్ ధ్వనికి ధర్మారావుగారి కుటుంబమూ, మిగతా విద్యార్థులూ, చుట్టుపక్కలి ఇళ్ళవాళ్ళూ బయటికొచ్చేరు, తెల్లబోయి జరుగుతున్న దంతా చూడసాగేరు.

పాలిపోయిన మొహంతో, మూగవడిన పెదాలతో, పొడారిన కంఠంతో ఆ స్త్రీ అందరికేసీ దీనంగా చూడసాగింది.

సార్జెంట్ ఎన్నో ప్రశ్నల్ని వరుసగా అడిగేడు.

ఆమె, జాలిగొలిపేట్టు చూడ్డం తప్ప, పెదిమ కదపలేదు.

"అట్లా పలుకుతావా - లాకప్‌లో వేసి నాలుగు రోజులు మాడుస్తేగాని! తీసికెళ్ళండ్రా" అన్నాడు.

"నడు!" అన్నారు పోలీసులు చుట్టుముటి.

"ఇదంతా ఏదో గాంగ్‌కు చెందిన రకమండీ! దీన్ని నిర్బంధిస్తే ముఠా అంతా బయటికొస్తుంది. థాంక్సు" అంటూ సార్జెంట్ దారితీసేడు.

నలుగురూ నాలుగువైపులా కాపలా కాస్తుంటే ఆ స్త్రీ గొప్ప నేరస్థురాలిలా వేన్‌వైపు వెళ్ళసాగింది. బెదురుతూనే ఎక్కబోతోంది...

"థాంక్యూ" అన్నాడు ఫోనుచేసిన పెద్దమనిషి- తను చేసిన ఘనకార్యానికి, ఘనంగా మొహాన్ని ఉబ్బరించుతూ.

ధర్మారావుకిదేమీ అర్థంకాలేదు. కాని అనాయాచితంగా కలుగజేసుకోవడం ధర్మం కాదనుకున్నారు.

"ఏం చేశావే, బిడ్డా! ఎక్కడమాయ మయ్యావ్? నీకోసం ఊరంతా గాలిస్తున్నాను- సాయంత్రం నుండీ" అంటూ ఓ పండు ముదుసలి, తడిసిన బట్టలతో, హరికేన్ లాంతరుతో, తెల్లని గుడ్డగల గొడుగుతో అక్కడ ఊడిపడ్డాడు.

"ఎవరు నువ్వు?" అంటూ గర్జించాడు సార్జెంట్, మీసాలు మెలివేస్తూ.

"నేను పాలు అమ్ముకునే చంద్రయ్యని బాబూ! ఇది నా కూతురు. నాలుగు గంటలకి మాయమైంది. ఊరంతా వెతికి చస్తున్నాను. ఏమీ ఎరగదు- మాటలు నేర్చిన లోకంలో మసలడమే ఎరుగదు. విడిచిపెట్టండి బాబూ. ఇది మూగపిల్ల- మాటలు రావు" అన్నాడు తండ్రి దీనాతి దీనంగా ప్రాధేయపడుతూ.

ధర్మారావుగారి కుటుంబమూ, సార్జెంటూ, పోలీసులూ, విద్యార్థులూ, భార్యాభర్తా విస్తుపోయారు. మిగతావాళ్ళకిదంతా అగమ్యగోచర మనిపించి మొహాలు ప్రశ్నార్థక రూపం దాల్చాయి.

"పాపం! మూర్ఖజనం మూగవీణపై అపస్వరాలు పలికింప జూసేరు!" అని జాలిపడుతూ గేటు లోపల వేసుకున్నారు ధర్మారావుగారు- వాన్ కదిలి వెళ్ళేక.

*01. 08. 1963–యువ మాసపత్రిక*